క్లుప్తంగా

పంట నష్టం అంచనాల్లో అధికారులు



పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను అంచనా వేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. పెదకాకాని మండలంలో అధికంగా సాగుచేస్తున్న పంట వరి కావడం, పండించిన పంట అంతా కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో అధిక వర్షాలు, ఈదురుగాలులకు పంట నేలవాలడంతో దెబ్బ తినే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గురువారం కూడా వరి పొలాల్లోకి చేరిన నీరు బయటకు కదలడం లేదు. రైతుల కూడా పొలాల్లో చేరిన నీటిని బయటకు పెట్టే పనిల్లోనే ఉన్నారు. పెదకాకాని మండలంలో 9,500 ఎకరాల్లో వరి పంట, 600 ఎకరాల్లో మినుము, 160 ఎకరాల్లో ప్రత్తి, జొన్న 80 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు



గుంటూరు రూరల్: తుఫాన్ ప్రభావం వల్ల గ్రామాలు, శివారు కాలనీల్లో రోగాలు ప్రభలకుండా పంచాయతీ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతిఅంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండలంలోని చల్లావారిపాలెం, మల్లవరం, తోకావారిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఎంపీపీ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటురోగాలు ప్రభలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు చేరువగా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. మురుగు కాల్వల్లో దోమలు నిల్వ లేకుండా చూడాలని, ఆయిల్ బాల్స్ వినియోగించాలని సూచించారు. భాగంగా ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంటనున్న చెత్త డంపింగ్‌లను పొక్లెయిన్‌తో తీయించి డంపింగ్‌యార్డ్‌లకు తరలించారు. ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆరుదల సాంబశివరావు, ఏరువ పద్మావతి, జగన్ మోహన్‌రెడ్డి, గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.

పొన్నూరు: తుఫాన్ తీవ్రత తగ్గిన నేపధ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోగాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వ చేరుకుండా, మురుగు కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. గోళ్లమూడి పాడు గ్రామంలో సర్పంచ్ రాజ్యలక్ష్మీ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు రోడ్లవెంట పిచ్చి మొక్కలు తొలగించి, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. మన్నవ గ్రామంలో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న కొల్లిమర్ల ప్రధాన డ్రెయిన్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

పొన్నూరు: కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించే పచ్చి శనగపప్పు అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పొన్నూరు సీఎస్ డీటీ భువనేశ్వరి ఫిర్యాదు మేరకు పట్టణంలోని ఎస్‌పీబీ రోడ్డులోని ఓ గోడౌన్‌లో నిల్వ ఉంచిన ఏడున్నర టన్నుల పచ్చి శనగపప్పును సీజ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై ప్యాకెట్ల రూపంలో ఇచ్చిన శనగపప్పును విడిగా బస్తాల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు ఈ దాడులు నిర్వహించి నాగసాయి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్య తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, ఏఓ కె.రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఇంజినీరింగ్ విద్యార్థికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామ పరిధిలో గురువారం జరిగింది. మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న గుంటూరుకు చెందిన కె.కమలాకర్ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు వెళ్తున్నాడు. వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కమలాకర్‌కు ముఖానికి, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైనాయి. అతనిని 108 వాహనం ద్వారా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



కాకుమాను - పుసులూరు గ్రామాల మధ్య నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కాకుమాను: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతుని గుర్తించి పంటనష్ట పరిహారం అందించేవిధంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. గత రెండు రోజుల క్రితం మిచాంగ్ తుపాన్ కారణంగా నీట మునిగిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో అధికంగా నీరు చేరిందని ఆయన తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పంటపొలాల్లో నిలిచిన నీటి బయటకు పంపే విధంగా రైతులు తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుని గుర్తించి ప్రతి ఒక్కరికి పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా మండలానికి చెందిన ఓ రైతు పాండ్రపాడు వద్ద ఉన్న బంకింగ్ హామ్ కెనాల్ అవుట్ లెట్ ద్వారా వరదనీటిని డ్రెయిన్‌లోకి మళ్లించి తుంగభద్ర కెనాల్‌లోకి పంపిస్తే మండలంలోని పలు గ్రామాలలో అధిక వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురికావని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. విషయాన్ని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టేవిధంగా తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, డీఏఓ నున్నా వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు గేరా పున్నారావు, మెరిగల రవిబాబు, కొత్త అమేష్, కాంద్రు హైమారావు, పెద్ది మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన...



గొరిజవోలుగుంటపాలెంలో పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే మేకతోటి

పెదనందిపాడు: ఇటీవల కురిసన వర్షాలకు పంట నీట మునిగిన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత సందర్శించారు. ఈ వర్షాల వలన నీట మునిగిన పొలాలను పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని గొరిజవోలుగుంటపాలెం, రావిపాడు, పుసులూరు, పెదనందిపాడు, వరగాని, గ్రామాలలో వారు పర్యటించారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని ఆమె చెప్పారు. ఆమె వెంట మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు కె.భూషయ్య, డి.నాగేశ్వరరావు, కల్లూరి నాగేశ్వరరావు, బండి వెంకటశివరావు, ఆవుల రామిరెడ్డి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ కొండా కృష్ణారెడ్డి, తహసీల్దార్ సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్, ఏఓ సుధారాణి, హెచ్ఓ బేబి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

ఏ ఒక్క రైతూ నష్టపోకూడదు

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుగా 80 శాతం రాయితీపై శనగలు
- వ్యవసాయ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే సుచరిత



వంగిపురంలో నీట నానుతున్న పంట పొలాలను పరిశీలిస్తున్న సుచరిత

ప్రత్తిపాడు: పంటలు దెబ్బ తిన్న రైతులు ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు వీలుగా 80 శాతం రాయితీపై శనగలు ఇవ్వడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత అన్నారు. మండల పరిధిలోని వంగిపురంలో తుపాను ప్రభావంతో దెబ్బ తిన్న పంటలను గురువారం ఎమ్మెల్యే సుచరిత పరిశీలించారు. మిర్చి, శనగ సాగు చేసిన రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిర్చి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, శనగ పైరు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తున్నామని, తుపానుతో ఆశలన్నీ నీళ్లపాలయ్యాయని తెలిపారు. ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేసుకునేందుకు శనగలు ఇప్పించాలని, పరిహారం కూడా సక్రమంగా నమోదు చేసేలా చూడాలని రైతులు సుచరితను కోరారు.

రైతులందరికీ శనగలు..

కేవలం శనగ పంట దెబ్బతిన్న రైతులకే కాకుండా, సాగు చేసిన మిర్చి పంట దెబ్బతిన్న రైతులకు కూడా రాయితీపై శనగలను అందించాలని ఎమ్మెల్యే సుచరిత వ్యవసాయాధికారి అరుణను ఆదేశించారు. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయాల్లో మనమంతా మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. రైతులు ఏ రకం అడిగితే ఆ రకం శనగలు ఇండెంట్ పెట్టి తెప్పించాలని స్పష్టం చేశారు.

రైతులకు పూర్తిస్థాయిలో నష్టం..

తుపాను ప్రభావంతో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లోని రైతులు పూర్తిగా నష్టపోవడం జరిగిందని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. పంటల పరిశీలన అనంతరం సుచరిత మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో 33 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రైతులు సాగుచేసిన ఒక్క ఎకరాకు సంబంధించిన పంట కూడా చేతికి వస్తుందన్న ఆశ కనిపించడం లేదన్నారు. ఇప్పటికే పరిస్థితులపై సీఎం సమీక్ష చేసి తడిసిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారన్నారు. నూటికి నూరు శాతం రైతులు నష్టపోయారని, అందుచేత ప్రత్యామ్నాయ పంటను సాగు చేసుకునేందుకు వీలుగా ఎనభై శాతం రాయితీపై ఒక్క రైతుకు కూడా ఇబ్బంది లేకుండా అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పునరావాస బాధితులకు సరుకుల కిట్లు, నగదును అందిస్తున్నారని తెలిపారు. గతంలో పంట నష్టం అంచనాలు వేసేందుకే చాలా రోజులు పట్టేదని, కానీ ఇప్పుడున్న సచివాలయ వ్యవస్థ వలన నమోదు గానీ, పంట నష్టం అంచనాలు గానీ త్వరితగతిన పూర్తి చేసే పరిస్థితి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, పార్టీ నాయకుడు గుజ్జుల శివారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

రైతులకు ప్రభుత్వం భరోసా..

కాకుమాను: మిచాంగ్ తుపాన్ కారణంగా పంటలు కోల్పోయిన రైతులెవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని పంట నష్టపోయిన ప్రతి రైతుని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత రైతులకు హామి ఇచ్చారు. మండలంలోని కాకుమాను, అప్పాపురం, రేటూరు గ్రామాలలో గత మూడు రోజుల క్రితం మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

కాకుమాను: మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన అధిక వర్షాల వలన ఇళ్లల్లోకి నీరు చేరిన వారిని గుర్తించి వెంటనే వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత అధికారులను ఆదేశించారు. మండలంలోని గ్రామాలలో పర్యటించి ఇళ్లల్లో నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి రోజు ఆ కుటుంబాలకు భోజనాన్ని అందించాలని ఆదేశించారు. స్థానిక ఎస్సీ కాలనీలో పలు కుటుంబాల ఇళ్లు నీట మునిగాయని వెంటనే వారి వివరాలను సేకరించి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నిత్యవసరాలు అందజేయాలని తహసీల్దార్ ప్రసాదరావుకు సూచించారు.

అన్నదాతలు అధైర్యపడవద్దు

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాల పరిశీలన



వేజండ్లలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



తుఫాన్ బాధిత మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

చేబ్రోలు: మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకునిపాలెం, శలపాడు, సుద్దపల్లి, వేజండ్ల గ్రామాల పరిధిలోని గ్రామాల పరిధిలో గురువారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలు, మిర్చి, కూరగాయ పంటలను పరిశీలించి రైతులతో పంట నష్టం గురించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. వేజండ్ల గ్రామ పరిధిలో డ్రెయిన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ, డ్రైయినేజీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ తుఫాన్, భారీ వర్షాల వల్ల పంట దెబ్బతిన్న రైతులకు అండగా ఉంటామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల పరిధిలో పంట నష్టం వివరాలు నమోదు చేసుకుని, అంచనాలు రూపొందించనున్నట్లు తెలిపారు. పంటల రక్షణ, పంటలకు నష్టపరిహారం అందించటం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయటం అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. పంట నష్టపరిహారం, పంటల బీమా ప్రయోజనాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రైతుల నుంచి తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పొలాల్లోని నీరు బయటకు పోవటానికి సమస్యగా ఉందని, ఎగువ నుంచి వర్షం నీటి ఉధృతి అధికంగా ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంట పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఏఓ శ్రీనివాస నాయక్, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్, షేక్ పెదమస్తాన్, శ్యామారావు, మన్నెం వేణు గోపాలరావు ఉన్నారు.

దివ్యాంగ రైతుకు భరోసా....

చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో పంట పొలాలను పరిశీలించటానికి వెళ్లిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దివ్యాంగ రైతును చూసి ఆయనకు భరోసా నిచ్చారు. ట్రై సైకిల్‌పై పొలం వచ్చి పంటను పరిశీలిస్తున్న దివ్యాంగ రైతును చూసి ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ వస్తుందా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పలకరించి కొంత నగదును అందజేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం..

పొన్నూరు: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలకు, ముఖ్యంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. గురువారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ కారణంగా పాక్షికంగా ఇళ్లు నష్టపోయిన బాధితులకు తక్షణ సహాయంగా రూ. 45 వేల చెక్కులను ఎమ్మెల్యే రోశయ్య అందజేశారు. మండంలోని ఉప్పరపాలెం, మాచవరం, మన్నవ, కసుకర్రు, పట్టణంలలో ఇంటిపై చెట్లు పడటం, ఈదురుగాలులకు రేకులు ఎగిరిపోయిన వంటి బాధితులు 10 మందికి ఒక్కొక్కరికి రూ.4,500 చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు కూడా త్వరితగతిన నష్టపరిహారం అందించి, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ కె.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మదమంచి రామస్వామి ట్రస్టు స్వాధీనం

ఈఓ. జె.వి.నారాయణ

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని బస్టాండు ఆవరణలో ఉన్న మదమంచి రామస్వామి ట్రస్టు భవనాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఈఓ జె.వి.నారాయణ తెలిపారు. స్థానిక చెన్నారెడ్డి ధర్మసత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ట్రస్టు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, దాత ఆశయాలు కొనసాగించడం లేదంటూ కొద్ది నెలల కిందట ప్రత్తిపాడుకు చెందిన కొందరు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, ఫిర్యాదుపై పలు దఫాలుగా ఏసీ, డీసీ, కమిషనర్ స్థాయిల్లో విచారణలు జరిగాయన్నారు. విచారణల అనంతరం దేవదాయశాఖ గెజిట్ పబ్లికేషన్ జారీ చేసి, సెక్షన్-43 రిజిస్టర్ అప్రూవల్ చేసి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించిందని ఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రస్టుకు సంబంధించిన భవనానికి గురువారం సాయంత్రం తాళాలు వేసి ప్రకటన కూడా అంటించామన్నారు. అంతేకాకుండా ట్రస్ట్ కిందట ఉన్న నాలుగు దుకాణాల నుంచి అద్దెలు కూడా వసూలు చేసుకున్నామని ఈఓ తెలిపారు. ట్రస్టుకు ప్రత్తిపాడులో రెండు ఎకరాలకు పైగా కమర్షియల్ భూమి ఉందని, మరో ఆరు ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు కూడా వేర్వేరు గ్రామాల్లో ఉన్నాయని ఈవో వెల్లడించారు. ప్రత్తిపాడులో ఉన్న రెండెకరాల భూమిలో మరికొన్ని నిర్మాణాలు కూడా ఉన్నాయని, వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గ్రామస్తుల సమక్షంలో పంచనామా జరిపి పదిరోజుల్లో పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుంటామని ఈఓ తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూముల విలువ సుమారు రూ.5కోట్లు ఉంటుందని చెప్పారు. ట్రస్టుకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు అప్పగించాలని ట్రస్టు సభ్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

సీఎం జగన్ పాలనలో గడప గడపకు సంక్షేమం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వెల్లలూరులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. గురువారం మండలంలోని వెల్లలూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే రోశయ్య పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారి వివరాలతో ప్రదర్శించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వెల్లలూరు గ్రామాన్ని మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. జగనన్న మళ్లీ సీఎంగా వస్తేనే ప్రజలకు మేలు జరు గుతుందని అన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ అంబటి వీర రాఘవయ్య, పార్టీ మండలాధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో..

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 9,10,11 వార్డుల పరిధి నాగుల చెరువులోని 6వ సచివాలయంలో రూ.30 కోట్లతో వార్డులలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో ప్రదర్శించిన బోర్డును వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు, పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమ్మద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ శకం..

ప్రత్తిపాడు: రాష్ట్రంలో సంక్షేమ శకం నడుస్తోందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని సచివాలయం-2లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల ప్రదర్శన ఫలకాన్ని ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

పెదకాకాని: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెదకాకాని శివాలయం పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కానుగోలు శంకరరావు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జగనన్న ద్వారానే సంక్షేమం సాధ్యం..

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారానే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ అర్బన్ క్లస్టర్ 1 కన్వీనర్ ఏటుకూరి విజయసారధి తెలిపారు. గురువారం 26వ డివిజన్ చౌడవరం నందు కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలపై డోర్‌టుడోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు..


చేబ్రోలు: నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ చేబ్రోలు మండల నాయకులు పేర్కొన్నారు. చేబ్రోలు -4 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ పెద మస్తాన్, గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణిలు మాట్లాడారు.

పోలేరమ్మ హుండీ కానుకలు లెక్కింపు

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ పోలేరమ్మ అమ్మ వారి హుండీ ఆదాయాన్ని గురువారం బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ట్రస్టుబోర్డు చైర్మన్ రామినేని నాగవేణి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈసందర్భంగా దేవాలయ ఈఓ బత్తుల సురేష్ బాబు మాట్లాడుతూ గత మూడు నెలల కాలానికి అమ్మ వారి హుండీ ఆదాయం రూ.6,54,455లు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు మండవ శ్రీనివాసరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పోలినేని రమేష్‌బాబు, రుద్రపాటి వరలక్ష్మి, కొమ్ము బోయిన శేషమ్మ, కొండపాటూరి పేరమ్మ, గ్రామ పెద్దలు, దేవాలయ పూజారులు పాల్గొన్నారు.

ఆనందంగా ఇళ్లకు చేరిన తుఫాన్ బాధితులు

81 కుటుంబాలకు రేషన్ సరుకులు, రూ.1,52,000 నగదు పంపిణీ



తుఫాన్ బాధితులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్

పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్న బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్పాహారం, భోజనం, మౌలిక వసతుల కల్పన వంటి ఏర్పాట్లు చేశారు. మండలంలోని నంబూరు యానాదికాలనీ వాసులు 56 కుటుంబాలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్నారు. పెదకాకాని బాజీనగర్‌లో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 25 కుటుంబాల వారిని ఉంచారు. వర్షం పూర్తిగా తగ్గడంతో వారిని క్షేమంగా, ఆనందంతో ఇళ్లకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు చొప్పున పంపిణీ చేశారు. అలానే గురువారం రాత్రి 81 వరదబాధితుల కుటుంబాలకు పరిహారంగా రూ.1,52,000 పంపిణీ చేశారు. వరద బాధితులు ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్ఐ రాజేశ్వరి, వీఆర్వోలు జయంతి, మహేష్, కృష్ణకిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరపు విజయలక్ష్మి, జొన్నల అవినాష్‌రెడ్డి, సయ్యద్ సుభాని, భీమవరపు కోటిరెడ్డి, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

చేబ్రోలు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ముంపుబారిన పడి పునరావాసా కేంద్రంలో ఉన్న బాధిత కుటుంబాలకు గురువారం రెవెన్యూ అధికారులు ఆర్థిక సహాయంను అందజేశారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లోని పునరావాస కేంద్రంలో క్రోసూరు, పత్తిపాడు మండలాలకు చెందిన 22 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వీరిందరికి బియ్యం, నిత్యవసర వస్తువులు అందజేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 19మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2500ల చొప్పున, ఒక్కరే వ్యక్తి ఉన్న కుటుంబానికి వెయ్యి రూపాయిల చొప్పున మొత్తం రూ.50,500ల నగదును పునరావాసా బాదిత కుటుంబాలకు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి



గుండవరం(చేబ్రోలు): మిచాంగ్ తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బిజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో గురువారం తుపాన్ వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి, కూరగాయ తోటలను పరిశీలించారు. పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ అవసరం ఉందని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి రైతు సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, జిల్లా నాయకులు చెరుకూరి తిరుపతిరావు, దానబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వేజండ్ల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చేబ్రోలు: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చేబ్రోలు మండలం వేజండ్ల పంచాయతీ కార్యదర్శి డి.సాంబశివరావును జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 2,3వ తేదీల్లో ఎన్నికల సంఘం స్పెషల్ క్యాంపెయిన్ డేను ప్రకటించింది. వేజండ్ల 101 పోలింగ్ కేంద్రం బీఎల్ఓ అయిన వేజండ్ల పంచాయతీ కార్యదర్శి శని, ఆదివారాల్లో ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యాడు. అధికారుల తనిఖీ సమయంలో పోలింగ్ కేంద్రం తాళం వేసి ఉండటంతో తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.